సాక్షి
పశ్చిమగోదావరి
గురువారం ; 27 ; జూలై ; 2023



చెల్లింపుల్లో ముందంజ

రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం సొమ్ముల చెల్లింపుల్లో పశ్చిమగోదావరి జిల్లా ముందంజలో ఉంది. రైతులకు రూ.1,310.82 కోట్లు చెల్లించారు. 8లో ▸



మేడెక్కిన ఆబోతు

ఎడతెరపి లేని వర్షంతో ఓ ఆబోతు మేడెక్కి స్థానికులను ఉరుకులు పెట్టించింది. రెండున్నర గంటల పాటు శ్రమించి దానిని సురక్షితంగా కిందకు దించారు. 8లో ▸



క్రైస్తవ సంఘాల ర్యాలీ

మణిపూర్‌లో ఉగ్రవాదుల దమనకాండను నిరసిస్తూ, అక్కడ శాంతి నెలకొల్పాలని ఏలూరు నగర క్రైస్తవ సమాజం ప్రతినిధులు ర్యాలీ చేశారు. 8లో ▸

న్యూస్‌రీల్

27 నుంచి ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

సాక్షి, భీమవరం: పాఠశాలలు, కళాశాలలో చేరి చదువుకోవడానికి వీలుకాని ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రమే ఓపెన్ స్కూల్ విద్యను ప్రోత్సహించాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఓపెన్ స్కూల్ ప్రవేశాలపై అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ 2023–24లో పదో తరగతిలో 831, ఇంటర్మీడియెట్‌లో 2,331 అడ్మిషన్లు లక్ష్యంగా నిర్ణయించామన్నారు. ప్రవేశాల నోటిఫికేషన్ విడుదలయ్యిందని ఈనెల 27 నుంచి వచ్చేనెల 31 వరకు అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈనెల 28న ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల ప్రక్రియపై ఓరియంటేషన్ ప్రోగ్రాం, ర్యాలీ నిర్వహిస్తామన్నారు. అలాగే వచ్చేనెల 5వ తేదీ వరకు ఓపెన్ స్కూల్‌పై అవగాహన వివిధ రకాలుగా కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారిని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు.

5న జిల్లాపరిషత్ సర్వసభ్య సమావేశం

ఏలూరు(మెట్రో): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రజాపరిషత్ స్థాయి సంఘ సమావేశాలు, జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం జెడ్పీ చైర్‌పర్సన్ అధ్యక్షతన వచ్చేనెల 5న ఉదయం 10 గంటల నుంచి ఏలూరు జెడ్పీ సమావేశపు హాలులో నిర్వహిస్తామని జెడ్పీ సీఈఓ కె.రవికుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజాపరిషత్ 1 నుంచి 7వ స్థాయి సంఘ సమావేశాలు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరుగుతాయని, మధ్యాహ్నం 2 గంటల నుంచి జెడ్పీ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని పేర్కొన్నారు. అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షిస్తామని తెలిపారు.

కార్గిల్ విజయ్ దివస్

తాడేపల్లిగూడెం (టీఓసీ): వెంకట్రామన్నగూడెంలోని ఉద్యాన కళాశాలలో బుధవారం కార్గిల్ విజయ్ దివస్‌ను నిర్వహించారు. వర్సిటీ డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ ఎస్.సలోమి సునీత హాజరై మాట్లాడుతూ మాతృభూమి కోసం ప్రాణాలను తెగించి పోరాడిన సైనికుల పోరాటాన్ని, దేశభక్తిని విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. సైనిక కుటుంబాలు చేస్తున్న త్యాగాలను జ్ఞాపకం ఉంచుకొని గౌరవించాలన్నారు. వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. అసోసియేట్ డీన్ ఎం.మాధవి, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్స్ సీపీ విజ్జి, శివకుమార్, ఉదయశ్రీ మాట్లాడారు.

మెరుగైన వైద్య సేవలే లక్ష్యం

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రభుత్వ వైద్యులు పోటీతత్వంతో ప్రజలకు వైద్య సేవలు అందించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో వైద్యశాఖ అధికారులు, వైద్యులతో ఆమె సమీక్షించారు. ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు కచ్చితంగా పెరగాలని కలెక్టర్ అన్నారు. కంటి వెలుగు కార్యక్రమం కింద కంటి పరీక్షలు శాతం తక్కువగా ఉండటంపై వివరణ కోరారు. నూరుశాతం కంటి పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో వైద్య సేవలను పెద్ద ఎత్తున అందించాలన్నారు. ఇమ్యునైజేషన్ కార్యక్రమంలో లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. ప్రధానమంత్రి మాతృ సంపద యోజన పథకంలో భాగంగా తొమ్మిదో నెలలో వైద్య సహాయం కోసం వచ్చిన గర్భిణులకు మహిళా సంక్షేమ శాఖ తప్పక ఆహారాన్ని అందించాలన్నారు. డీఎంహెచ్ఓ డి.మహేశ్వరరావు, అడిషనల్ డీఎంహెచ్ఓ భానునాయక్, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ అధికారి బి.సుజాత రాణి, డీఐఓ దేవ సుధ, పీహెచ్‌సీల అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ కంట్రోల్‌రూమ్‌ల ఏర్పాటు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): భారీ వర్షాలు, గోదావరి వరద నేపథ్యంలో విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేశామని విద్యుత్ సంస్థ ఏలూరు సర్కిల్ పర్యవేక్షక ఇంజనీర్ పి.సాల్మన్‌రాజు ఓ ప్రకటనలో తెలిపారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు ఏలూరులోని రామచంద్రరావు పేట విద్యుత్ భవన్‌లో 9440902926, జంగారెడ్డిగూడెం డివిజన్ ఆఫీసులో 9491030713 నంబర్లతో 24 గంటలూ పనిచేసేలా కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటుచేశామని పేర్కొన్నారు. వర్షాల కారణంగా తెగిపడిన విద్యుత్ వైర్లను, విద్యుత్ స్తంభాలను ప్రజలు తాకవద్దని విజ్ఞప్తి చేశారు. విద్యుత్ అంతరాయం లేదా సమస్య తలెత్తితే టోల్‌ఫ్రీ నంబర్ 1912కు గాని కంట్రోల్‌రూమ్ నంబర్ 9440902926కు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు.

కుండపోత

చినుకు.. వణుకు

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- పలుచోట్ల గండ్లు
- పొంగిపొర్లుతున్న వాగులు
- ఏలూరు జిల్లాలో 2,115 మి.మీ. పశ్చిమలో 822 మి.మీ వర్షపాతం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా మూడు రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తోంది. మంగళవారం రాత్రి నుంచి బుధవారం రాత్రి వరకు ఏకధాటిగా వర్షం కురవడంతో జనజీవనం స్తంభించింది. ఏజెన్సీ ప్రాంతంలోని వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. దీంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. గడిచిన 24 గంటల్లో ఏలూరు జిల్లాలో 2,115.6 మిల్లీమీటర్లు, పశ్చిమగోదావరి జిల్లాలో 822 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. లోతట్టు ప్రాంతాలు, పలు కాలనీలు జలమయమయ్యాయి. గోదావరి ముంపు ప్రాంతాల్లో వరద సహాయక చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి.

రహదారులకు గండ్లు

పెదవేగి సమీపంలో ముసునూరు మండలం బలివే మార్గంలో తమ్మిలేరు ఉధృతికి రోడ్డు కొట్టుకుపోగా రాకపోకలు ఇబ్బంది ఎదురైంది. లింగపాలెం మండలం రంగాపురం మీదుగా కళ్లచెరువు గ్రామాన్ని కలిపే తాత్కాలిక మట్టి రోడ్డు గుండేరు వాగు ఉధృతికి కొట్టుకుపోయింది. జంగారెడ్డిగూడెం మండలం పట్టెన్నపాలెం వద్ద జల్లేరు వాగు ఉధృతంగా ప్రవహించగా ఆ ప్రాంతంలోని డైవర్షన్ రోడ్డు కొట్టుకుపోయింది. శ్రీనివాసపురం సమీపంలో రేల వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. పోలవరం నియోజకవర్గంలో కొండవాగులు పొంగుతుండగా కొవ్వాడ కాలువకు పట్టిసీమ సమీపంలో గండి పడింది. గోదావరి నీటి మట్టం 41 అడుగులకు చేరుకోవడంతో ఏజెన్సీ ప్రాంతంలోని 12 నుంచి 13 గ్రామాలు ముంపునకు గురయ్యాయి. జిల్లా అధికార యంత్రాంగం ప్రమాదాన్ని ముందే అంచనా వేసి సహాయక చర్యలు చేపట్టడంతో ప్రజలకు ఊరట లభించింది. కైకలూరు–ఆకివీడు మధ్యలో ఆలపాడు వద్ద నిర్మిస్తున్న ఫ్లైఓవర్ ప్రాంతంలో డైవర్షన్ రహదారిలో లారీ దిగబడగా ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

ఆక్వా రైతుల్లో ఆందోళన

ఏకధాటి వర్షాలతో జిల్లాలోని ఆక్వా రైతుల్లో ఆందోళన మొదలైంది. చెరువుల్లో ఆక్సిజన్ అందక రొయ్యలు తేలిపోయే ప్రమాదముందని అంటున్నారు.



తాడేపల్లిగూడెం రూరల్: మాధవరం కాజ్‌వే వద్ద..



బుట్టాయగూడెం: ఇప్పలపాడు వద్ద ద్విచక్ర వాహనాన్ని వాగు దాటిస్తున్న యువకులు

వర్షాలు మరో నాలుగు రోజులపాటు కొనసాగుతాయని వాతావరణ శాఖ అధికారులు ప్రకటించడంతో ఆవేదన చెందుతున్నారు. అలాగే కూరగాయల తోటలు కుళ్లిపోయే పరిస్థితి ఏర్పడింది. వరి నాట్లు ఇప్పుడిప్పుడే మొదలుకావడంతో వర్షాల వల్ల పెద్దగా ప్రమాదం ఉండదని భావిస్తున్నారు.

రంగంలోకి ఎస్డీఆర్ఎఫ్ బృందాలు

ఏలూరు కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ రెవెన్యూ యంత్రాంగాన్ని, జిల్లా ఎస్పీ పి.మేరీప్రశాంతి పోలీస్ యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టడం కోసం రెండు ఎస్డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగాయి. గోదావరి ముంపు ప్రాంతాలైన వేలేరుపాడు, కుక్కునూరు ప్రాంతాల్లో ఈ బృందాలు ఇప్పటికే సిద్ధంగా ఉన్నాయి. వీటిలో వేలేరుపాడులో ఎస్డీఆర్ఎఫ్ 6వ బెటాలియన్‌కు చెందిన 35 మందితో కూడిన బృందం 10 టన్నుల కెపాసిటీ కలిగిన వాహనంలో సహాయక చర్యలకు అవసరమైన పరికరాలతో సిద్ధంగా ఉంది. అలాగే ఎస్డీఆర్ఎఫ్‌కు 3వ బెటాలియన్‌కు చెందిన 40 మంది బృందంతో కుక్కునూరులో 10 టన్నుల సామర్థ్యం గల వాహనంతో సిద్ధంగా ఉంది.

ఎర్ర కాలువకు వరద నీరు

తాడేపల్లిగూడెం రూరల్: ఎర్రకాలువకు వరద నీరు పోటెత్తింది. దీంతో మండలంలోని మాధవరం–కంసాలిపాలెం కాజ్‌వేపై నుంచి వరద నీరు ప్రవహిస్తోంది. శిథిలమైన కాజ్‌వే స్థానే తాత్కాలికంగా నిర్మించిన వారధిపై నుంచి వరద నీరు ప్రవహించడంతో చూసేందుకు ప్రజలు తరలివస్తున్నారు. మూడ్రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఎర్రకాలువ పరీవాహక ప్రాంతాల రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.



ముసునూరు: ముసునూరు మండలం బలివే వద్ద తాత్కాలిక రహదారికి గండిపడిన దృశ్యం

తగ్గినట్టే తగ్గి.. మళ్లీ పెరిగి..

యలమంచిలి: మండలంలో గోదావరిలో వరద బుధవారం ఉదయం తగ్గుముఖం పట్టి మళ్లీ సాయంత్రానికి యథాస్థితికి చేరింది. ఐదు రోజులుగా కనకాయలంక కాజ్‌వే మీద నాలుగు నుంచి ఐదు అడుగుల నీరు ప్రవహిస్తోంది. భద్రాచలం వద్ద నీటిమట్టం 39 మీటర్లకు తగ్గడంతో ఉదయం కాజ్‌వేపై వరద తగ్గుతూ రెండు అడుగులకు చేరుకుంది. దీంతో పాదచారులు నడచి వెళ్లారు. అయితే రోజంతా వర్షం కురవడంతో రెవెన్యూ అధికారులు కాజ్‌వే మీద నడచి వెళ్లకుండా చర్యలు తీసుకున్నారు. రాకపోకలకు రెండు పడవలు ఏర్పాటుచేశారు. భద్రాచలం వద్ద వరద నీరు 43 మీటర్లకు పెరగడంతో కానకాయలంక కాజ్‌వే మీద కూడా వరద నీరు సాయంత్రం ఐదు గంటల సమయానికి ఐదడుగులకు చేరింది. గురువారం కాజ్‌వేపై మరింత వరద పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

పాలకొల్లులో అత్యధిక వర్షపాతం

సాక్షి, భీమవరం: జిల్లాలో ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తోంది. గడిచిన 24 గంటల్లో జిల్లాలోని 20 మండలాల్లో దాదాపు 822 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా పాలకొల్లులో 90.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. మండలాల వారీగా భీమవరంలో 45.8, వీరవాసరంలో 32.6, యలమంచిలిలో 49.8, నరసాపురంలో 48.8, కాళ్లలో 40.2, మొగల్తూరులో 29.6, పోడూరులో 32.4, ఆచంటలో 44, ఇరగవరంలో 41.2, పెనుగొండలో 30, పెనుమంట్రలో 40.4, పాలకోడేరులో 42.2, ఉండిలో 45.6, ఆకివీడులో 40. గణపవరంలో 43.2, అత్తిలిలో 35.2, తణుకులో 34.8, పెంటపాడులో 18.2, తాడేపల్లిగూడెంలో 37.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.



బుట్టాయగూడెం: ఉధృతంగా ప్రవహిస్తున్న జల్లేరు వాగు



ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు పవర్‌స్టేషన్ సెంటర్‌లో..



యలమంచిలి: కనకాయలంక కాజ్‌వేపై వరద నీరు

భారీ వర్షాలపై అప్రమత్తం

కలెక్టర్ ప్రశాంతి దిశానిర్దేశం



కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం (ప్రకాశంచౌక్): భారీ వర్షాలు, గోదావరి వరద నేపథ్యంలో అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె వర్షాలు, గోదావరి వరద పరిస్థితులపై అడిగి తెలుసుకున్నారు. లంక గ్రామాల్లోని గర్భిణులను ప్రసవం నిమిత్తం ప్రభుత్వాస్పత్రుల్లో చేర్పించాలని డీఎంహెచ్ఓను ఆదేశించారు. మత్స్యకారులు వేటకు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని, ఎవరైనా వెళ్లినా వెనక్కి రప్పించాలన్నారు. గోదావరి నదీ పరీవాహక ప్రాంతాల్లో పోలీస్ పహారా ఏర్పాటుచేయాలన్నారు. పడవలు, వలలు భద్రపరిచేలా చర్యలతో పాటు మత్స్య సంపదను మార్కెట్‌కు తరలించి అమ్మకం అయ్యేలా చూడాలని మత్స్యశాఖ అధికారులకు సూచించారు.

ఏటిగట్ల పర్యవేక్షణ

గోదావరి ఏటిగట్లను నిరంతరం పర్యవేక్షించాలని, బలహీనంగా ఉంటే యుద్ధప్రాతిపదికన రక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఇసుక బస్తాలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఎటువంటి విపత్తును అయినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు.

కాలువలు దాటొద్దు

వర్షాల కారణంగా కాలువలు, గుంటలు దాటవద్దని ప్రజలకు కలెక్టర్ సూచించారు. అలాగే శిథిలావస్థలో ఉన్న ప్రైవేట్, ప్రభుత్వ భవనాలు గుర్తించి సురక్షిత ప్రాంతాల్లో తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలల్లో నిర్మాణ పనులు జరుగుతున్న చోట రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. గోదావరి పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉంటడంతో పాటు పశువులు, గొర్రెలు, మేకలను మేతకు తీసుకు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ముంపు ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన వైద్య శిబిరాల్లో అన్నిరకాల మందులతోపాటు పాముకాటు విరుగుడు మందులు సిద్ధం చేసుకోవాలన్నారు. ముంపు బాధితులకు మంచినీటి ప్యాకెట్లు అందించాలని, అవసరమైన చోట హ్యాండ్ పంపులు వేయాలని, జనరేటర్లు సిద్ధం చేసుకోవాలని సూచించారు. విద్యుత్, రక్షిత మంచినీటి సరఫరాకు అంతరాయం లేకుండా చూడటంతో పాటు అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలన్నారు. జెడ్పీ సీఈఓ కేవీఎస్ఆర్ రవికుమార్, నరసాపురం సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి జేసీ ఎస్.రామసుందర్ రెడ్డి, సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ హాజరయ్యారు.

మత్స్యకారులూ.. వేటకు వెళ్లొద్దు : కలెక్టర్

మొగల్తూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో సముద్రపు అలలు ఉవ్వెత్తున ఎగసి పడుతుండటంతో మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని తహసీల్దార్ జి.అనితాకుమారి బుధవారం తెలిపారు. వారం పాటు మత్స్యకారులు వేటకు వెళ్లరాదని, అలాగే బీచ్‌కు సందర్శకులు రాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారన్నారు. ఈ మేరకు కేపీ పాలెం నుంచి పేరుపాలెం వరకు రెవెన్యూ సిబ్బందిని అప్రమత్తం చేశామని, నాలుగు ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేశామన్నారు.



కేపీపాలెంలో ఎగసి పడుతున్న సముద్ర అలలు

కొటేషన్లు పెంచేసి.. అడ్డంగా బొక్కేసి!

- వేల్పూరు పంచాయతీలో టీడీపీ అక్రమాలు
- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న పాలకవర్గం
- విచారణకు కలెక్టర్ ఆదేశం



వేల్పూరు పంచాయతీ కార్యాలయం

తణుకు: అక్రమాలకు తెరలేపుతూ పశ్చిమగోదావరి జిల్లాలోని తణుకు మండలం వేల్పూరు పంచాయతీని తెలుగుదేశం పార్టీ నాయకులు భ్రష్టుపట్టించారు. గత పంచాయతీ ఎన్నికల్లో ఇక్కడ తెలుగుదేశం పార్టీ బలపర్చిన పాలకవర్గం గెలుపొందడంతో అక్రమాలకు తెరలేపారు. పంచాయతీలో జరుగుతున్న అక్రమాలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు అందడంతో కలెక్టర్ పి.ప్రశాంతి విచారణకు ఆదేశించారు. గతంలో ఎల్ఈడీ బల్బుల కొనుగోళ్లలో టీడీపీకి చెందిన సభ్యుడు రూ.900తో కొటేషన్ తీసుకువస్తే అది కాదని మరో టీడీపీ నేత రూ.1,800తో ఇచ్చిన కొటేషన్ ఆమోదించడం విమర్శలకు తావిచ్చింది. అలాగే పలు అక్రమాలు చోటు చేసుకున్నాయి. పంచాయతీలో 18 వార్డులు, 6 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. 2021లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ బలపర్చిన 11 మంది వార్డు సభ్యులు గెలుపొందారు. అయితే ఆరు ఎంపీటీసీ స్థానాలను వైఎస్సార్ సీపీ అభ్యర్థులు గెలుచుకున్నారు. పంచాయతీ సర్పంచ్‌గా విశ్వనాథం కృష్ణవేణి అధికారం చేపట్టిన నాటి నుంచి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు పెత్తందారులుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రధానంగా అదే గ్రామానికి చెందిన మాజీ ప్రజాప్రతినిధి అనుచరులు పంచాయతీ వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటూ అయినకాడికి దోచుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి.

బోర్డు సభ్యులకు తెలియకుండానే..

పంచాయతీలో వైఎస్సార్ సీపీ సానుభూతిపరులైన ఏడుగురు వార్డు సభ్యులకు ఎలాంటి సమాచారం లేకుండానే బోర్డు సమావేశం నిర్వహిస్తున్నారు. మినిట్స్‌బుక్‌లో తమకు నచ్చిన విధంగా రాసుకుంటున్నారని సభ్యులు ఆరోపిస్తున్నారు. అలాగే తాము లేవనెత్తిన సమస్యలను పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా వ్యవహిస్తున్నారని అంటున్నారు. గ్రామంలో పలు సామాజిక వర్గాలకు చెందిన సభ్యుల కోరిక మేరకు పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు అధికారం చేపట్టిన వెంటనే గ్రామంలో ఆరు కమ్యూనిటీ సమావేశ మందిరాల నిర్మాణాలకు హామీ ఇచ్చారు. ఈ మేరకు రూ.1.59 కోట్ల నిధులను 14, 15 ఆర్థిక సంఘం నుంచి మంజూరు చేసేలా అప్పటి ప్రత్యేక అధికారి పర్యవేక్షణలో పంచాయతీ తీర్మానం చేసింది. అయితే కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం పూర్తయ్యే సమయానికి పగ్గాలు చేపట్టిన పంచాయతీ పాలకవర్గం నిర్మాణాలను నిలిపివేసింది. అప్పటివరకు అయిన ఖర్చులు రూ.43.33 లక్షలు చెల్లించకుండా ఉద్దేశపూర్వకంగానే కోర్టును ఆశ్రయించడంతో పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి.

ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు



వేల్పూరు పంచాయతీ పాలకవర్గం గ్రామ అభివృద్ధి విషయంలో ఏకపక్షంగా వ్యవహరిస్తోంది. అధికార పార్టీ సానుభూతి పరులమనే ఉద్దేశంతో మేం సూచించిన అంశాలను పక్కన పెట్టి సొంత నిర్ణయాలతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇందుకు తెలుగుదేశం పార్టీకి చెందిన ప్రజాప్రతినిధి ముఖ్య అనుచరుడు కీలకపాత్ర పోషిస్తూ పెద్ద ఎత్తున నిధులను పక్కదోవ పట్టిస్తున్నారు.

– కేవీ సుబ్రహ్మణ్యం, 11వ వార్డు మెంబర్, వేల్పూరు పంచాయతీ

అక్రమాలెన్నో..

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీల స్థానంలో పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బందిని చేర్చి వారి వేతనాలను సైతం తెలుగుదేశం పార్టీ నేతలు కాజేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుల పేరుతో జాతీయ ఉపాధి హామీ పనులు ప్రైవేటు స్థలాల్లో చేయిస్తూ పెద్ద ఎత్తున నిధులు దుర్వినియోగం చేస్తున్నట్టు తెలుస్తోంది. ఇదే వ్యవహారంలో ఇటీవల రూ.7 లక్షలు కాజేశారనే ఆరోపణలు గుప్పుమన్నాయి. పారిశుద్ధ్య పనుల్లో వినియోగించే రిక్షాల మరమ్మతుల నిమిత్తం గత సమావేశంలో రూ.48 వేలు చెల్లించాలని తీర్మానం చేశారు. అ యితే మరమ్మతులు చేస్తున్న వ్యక్తికి ప్రతినెలా రూ.4 వేలు వేతనం పంచాయతీ నిధుల నుంచి అందజేస్తున్నారు. మరి రూ.48 వేలు దేనికని ప్రశ్నించగా స్పేర్ పార్టుల కోసమని సమాధానం ఇస్తున్నారని వార్డు సభ్యులు వాపోతున్నారు. నిధుల దుర్వినియోగంపై టీడీపీలోని కొందరు నాయకులు, వార్డు సభ్యుల మధ్య విభేదాలు రావడంతో ఈ వ్యవహారం రచ్చకెక్కింది. అలాగే గతంలో ఎల్ఈడీ బల్బుల కొటేషన్ల వ్యవహారం కూడా విమర్శలకు తావిచ్చింది.

సాహస బాలుర అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

భీమవరం (ప్రకాశంచౌక్): జాతీయస్థాయిలో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డులకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారత అధికారి బి.సుజాతారాణి తెలిపారు. సాహస బాలల అవార్డులు, అసాధారణ సామర్థ్యాలు (ఆటలు, సామాజిక సేవ, సైన్సు సాంకేతికత, పర్యావరణం, కళలు, సాంస్కృతిక ఆవిష్కరణలు) కలిగిన బాలలు ఆన్‌లైన్ ద్వారా http://awardr.gov.in నందు ఆగస్టు 31లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

క్లుప్తంగా

నారుమడుల్లో నీరు నిల్వ లేకుండా చూడండి



మంచిలిలో నారుమడిని పరిశీలిస్తున్న జేడీఏ

అత్తిలి: ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షాలకు నారుమడులు, నాట్లు వేసిన పంటచేల పరిస్థితిపై జిల్లా వ్యవసాయశాఖ అధికారి జడ్.వెంకటేశ్వరరావు బుధవారం కంచుమర్రు, మంచిలి గ్రామాల్లో పరిశీలించారు. నారుమడులను పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నారుమడులలో నీరు నిల్వ లేకుండా రైతులు చర్యలు తీసుకోవాలన్నారు. పంట పరిస్థితిపై ఎప్పటికప్పుడు నివేదికలు పంపాలని అధికారులను ఆదేశించారు. ఏఓ టీకే రాజేష్, గ్రామ సహాయకులు కృష్ణ, చంద్రిక, రాము తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో వ్యక్తి అరెస్టు

ఆకివీడు : పెళ్లికి అంగీకరించలేదని ఇద్దరిపై హత్యాయత్నం చేసి కుమార్తెను తీసుకెళ్లిన కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్సై సత్యసాయి బుధవారం చెప్పారు. సిద్ధాపురంలో నివాసం ఉంటున్న షేక్ బాబర్, అతని కుమార్తె సయ్యద్ సబియా సుల్తానాపై షేక్ ఇమ్రాన్ అనే వ్యక్తి హత్యాయత్నం చేసి కుమార్తెను తీసుకువెళ్లిపోయాడు. ఈ కేసులో నిందితుడు షేక్ ఇమ్రాన్‌ను అదుపులోకి తీసుకుని సుల్తానా కుమార్తెను సిద్ధాపురంలోని ఇంటి వద్ద కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

ధాన్యం సొమ్ము చెల్లింపుల్లో ముందంజ

- పశ్చిమగోదావరి జిల్లాలో 2.19 లక్షల ఎకరాల్లో వరి సాగు
- దాళ్వాలో 6.43 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు
- 73,966 మంది రైతుల ఖాతాలకు రూ.1,310.82 కోట్లు
- ఆధార్ లింకేజీ కాక 117 మంది రైతులకు జమ కాని సొమ్ము



భీమవరంలో దాళ్వా ధాన్యం పట్టుబడులు దృశ్యం (ఫైల్)

సాక్షి, భీమవరం: రైతుల నుంచి కొనుగోలు చేసిన పంటకు సొమ్ములు చెల్లించడంలో రాష్ట్ర ప్రభుత్వం నూతన ఒరవడిని సృష్టించడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రైతులు పండించిన ధాన్యం విక్రయించిన వారంలోగా సొమ్ములను వారి బ్యాంకు ఖాతాలకు రాష్ట్ర ప్రభుత్వం జమ చేసింది. పండించిన పంటను నేరుగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించడం ద్వారా దళారుల కమీషన్ల బెడద లేకుండా రైతులకు మద్దతు ధర అందుతోంది. అంతేగాకుండా ధాన్యం సొమ్ములతోపాటు గోనె సంచులు, హమాలీలు, రవాణా చార్జీలను సైతం ప్రభుత్వమే చెల్లించడం రైతులకు వరంగా మారింది.

296 కేంద్రాల ద్వారా కొనుగోళ్లు

జిల్లాలోని 20 మండలాల పరిధిలో గడిచిన దాళ్వా సీజన్‌లో సుమారు 2.19 లక్షల ఎకరాల్లో రైతులు వరి పండించగా, పంట కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం 296 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. ధాన్యాన్ని దళారులు, రైస్ మిల్లర్లకు విక్రయించకుండా నేరుగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే ధాన్యం అమ్మకం చేసిన 21 రోజుల్లోగానే పంట సొమ్ము రైతుల బ్యాంకు ఖాతాలకు జమచేస్తుందని వ్యవసాయ, రెవెన్యు శాఖాధికారులు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. దీనితో దాళ్వా సీజన్‌లో జిల్లాలోని 74,083 మంది రైతుల నుంచి 6,43,128 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. వీరికి మొత్తం రూ.1,312.21 కోట్లు చెల్లించాల్సి ఉండగా రూ.1,310.82 కోట్లు చెల్లించారు. అలాగే గోనె సంచులు, హమాలీ, రవాణా చార్జీలకు రైతులకు చెల్లించాల్సిన సుమారు రూ.41.55 కోట్లు దాదాపు జమ చేయగా కొద్దిమొత్తంలో ధాన్యం రవాణ చేసిన ఏజెన్సీలకు చెల్లించాల్సి ఉంది.

బ్యాంకు లింకేజీ సక్రమంగా లేకే జాప్యం

జిల్లాలోని ధాన్యం విక్రయాలు చేసిన రైతుల్లో కేవలం 117 మందికి రూ.1.39 కోట్లు చెల్లించాల్సి ఉంది. అయితే ఆయా రైతులు తమ బ్యాంకు ఖాతాలకు ఆధార్ లింకేజీ చేయకపోవడం, జన్‌ధన్ బ్యాంకు ఖాతాకు కేవలం రూ.50 వేలు మాత్రమే జమచేసే అవకాశం ఉండడం వంటి అవరోధాలు కారణంగా సొమ్ములు జమ కాలేదు. అలాగే గోనె సంచులు, రవాణా, హమాలీ చార్జీలకు సంబంధించి రైతులకు చెల్లించాల్సిన మొత్తం వారి బ్యాంకు ఖాతాల్లో జమచేయగా ఏజెన్సీల ద్వారా ధాన్యం రవాణా చేసిన సుమారు రూ.1.58 కోట్ల సొమ్మును ఏజెన్సీలు క్లయిమ్స్ అందజేయకపోవడంతో చెల్లించలేదు. ధాన్యం సొమ్ములతోపాటు రైతులకు రవాణా, హమాలీ, గోనె సంచులకు సంబంధించిన సొమ్ములను త్వరితగతిన ప్రభుత్వం చెల్లిస్తుండడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సకాలంలో ధాన్యం సొమ్ముల చెల్లింపు



ప్రభుత్వం కొనుగోలు చేస్తున్న ధాన్యానికి సంబంధించి వెను వెంటనే సొమ్ములు రైతుల బ్యాంకు ఖాతాలకు జమ అవుతున్నాయి. దీనికి గాను ప్రతి సీజన్‌కు రైతులు పండించే పంటకు ఈ క్రాప్ నమోదు తప్పనిసరి. దాళ్వా సీజన్‌లో దాదాపు రైతులందరికీ సొమ్ములు జమయ్యాయి. కేవలం 117 మంది రైతులు తమ బ్యాంకు ఖాతాలను బ్యాంకు లింకేజీ వంటి సమస్యలతో జమ కాలేదు. అటువంటి వారికి జన్‌ధన్ ఖాతాలు గాకుండా కొత్తగా బ్యాంకు ఖాతాలు ప్రారంభించి బ్యాంకు ఖాతాకు ఆధార్ లింకేజీ చేయించుకోవాలి.

– జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయశాఖాధికారి, భీమవరం

మాధవరంలో ఘనంగా కార్గిల్ విజయ్ దివస్

తాడేపల్లిగూడెం రూరల్: దేశ రక్షణ రంగంలో సేవలందిస్తూ మాధవరం గ్రామ సైనికులు దేశ భక్తిని చాటుకుంటున్నారని మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బొల్లం వీరయ్య అన్నారు. కార్గిల్ విజయ్ దివస్‌ను బుధవారం మాధవరం గ్రామంలో నిర్వహించారు. తొలుత అమరవీరుల స్తూపం వద్ద గౌరవ వందనం చేశారు. ఈ సందర్భంగా బొల్లం వీరయ్య మాట్లాడుతూ దేశం కోసం కార్గిల్ యుద్ధంలో మాధవరం గ్రామానికి చెందిన సైనికులు పాల్గొని వీరోచిత పోరాటం చేశారన్నారు. కార్గిల్ యుద్ధంలో అసువులు బాసిన సైనికుల త్యాగాలు మరువలేనివన్నారు. నేటి యువత సాఫ్ట్‌వేర్, ఇంజనీరింగ్ రంగంతో పాటు దేశ రక్షణ రంగంలోనూ చురుగ్గా పాల్గొని దేశభక్తి చాటుకోవాలన్నారు. అనంతరం ఆర్మీలో కార్గిల్ యుద్ధంలో వీరోచిత పోరాటం చేసిన జుజ్జూరి వీరనాగబ్రహ్మం, గూడా సుందరరావులను సన్మానించారు. మాజీ సైనికులు తమ్మిశెట్టి చుక్కయ్య, గోపిశెట్టి భరతుడు, ప్రత్తి రామకృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.



కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న జుజ్జూరి వీరనాగబ్రహ్మంను సన్మానించిన దృశ్యం



మాధవరంలో జాతీయ పతాకానికి గౌరవ వందనం చేస్తున్న మాజీ సైనికులు

ఐటీఐలలో ప్రవేశాల కౌన్సెలింగ్‌కు గడువు పొడిగింపు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు జిల్లాలోని 5 ప్రభుత్వ, 14 ప్రైవేట్ ఐటీఐలలో 2023–24 విద్యా సంవత్సరానికి మిగిలి ఉన్న సీట్ల భర్తీ నిమిత్తం రెండో విడత కౌన్సెలింగ్ ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా నిర్వహించడానికి ఈ నెలాఖరు వరకు గడువు పొడిగించినట్లు ఏలూరు ప్రభుత్వ ఐటీఐ ప్రధానాధికారి పి.రజిత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఐటీఐ వెబ్‌సైట్‌లో స్టూడెంట్ ఏరియాలో విద్యార్థి ఆన్‌లైన్ దరఖాస్తును పూర్తి చేసి ఈ నెల 31వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా సమర్పించాలని సూచించారు. అనంతరం దరఖాస్తు కాపీని ప్రింట్ తీసుకుని విద్యార్థి తన ఒరిజినల్ సర్టిఫికెట్లతో తాము ఎంచుకున్న సంబంధిత ఐటీఐలలో ఆగస్టు 1వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు. వెరిఫికేషన్ పూర్తయిన వారు మాత్రమే కౌన్సెలింగ్‌కు హాజరుకావడానికి అర్హులన్నారు. ఈ మేరకు ఏలూరు జిల్లాలో ప్రభుత్వ ఐటీఐలల్లో 700 సీట్లు, ప్రైవేట్ ఐటీఐలలో 1,712 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. అలాగే 10వ తరగతి ఉత్తీర్ణులై ఆ పైన చదువుకుని ఉపాధి కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు కూడా ఈ ప్రవేశాలకు అర్హులని, 8వ తరగతి ఉత్తీర్ణులై 10వ తరగతి అనుత్తీర్ణులైన విద్యార్థులు వెల్డర్ ట్రేడ్‌కి దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. ఇతర వివరాలకు 08812–230269 నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

గంజాయి విక్రేత అరెస్టు

ఆగిరిపల్లి (నూజివీడు): చొప్పరమెట్లలో గంజాయిని విక్రయిస్తున్న పలగాని కృష్ణారావును అరెస్టు చేసి అతని నుంచి 1.240 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సంబూరి చంటిబాబు బుధవారం చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. చొప్పరమెట్లకు చెందిన కృష్ణారావు మూడేళ్ల నుంచి విజయవాడ రైల్వేస్టేషన్ వద్ద గంజాయి కొనుక్కొని తాగేవాడు. అప్పటి నుంచి అది వ్యసనంగా మారి రైల్వేస్టేషన్ వద్దే పలుమార్లు గంజాయిని ఎక్కువగా కొనుగోలు చేసి ఇంటికి తెచ్చుకుని తాగుతున్నాడు. ప్రస్తుతం డబ్బులు అవసరమై తన వద్ద ఉన్న గంజాయిని సంచిలో పెట్టుకుని విజయవాడ రైల్వేస్టేషన్ పరిసరాల్లో విక్రయించేందుకు బయలుదేరి గ్రామంలోని ప్రధాన రోడ్డుపై ఆటో కోసం వేచి ఉండగా, అందిన సమాచారం మేరకు దాడి చేసి డీటీ పవన్‌కుమార్ సమక్షంలో కృష్ణారావును ఎస్సై అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి నూజివీడు రూరల్ సీఐ ఆర్.అంకబాబు దర్యాప్తు చేస్తున్నారు.

చానల్ విలేకరి వేధింపులపై కేసు నమోదు

పెనుగొండ: అంగన్‌వాడీ కార్యకర్తను వేధింపులకు గురిచేస్తున్న ఓ చానల్ విలేకరిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.రాజ్‌కుమార్ చెప్పారు. ఆచంట నియోజకవర్గానికి చెందిన చానల్ విలేకరి జె.శ్రీనివాస్ అసభ్యంగా మాట్లాడటమే కాక బెదిరింపులకు గురిచేస్తూ మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నాడని కరుగోరుమిల్లికి చెందిన అంగన్‌వాడీ టీచరు బోళ్ల కమల పోలీసులకు ఫిర్యాదు చేసింది. భర్తతో మనస్పర్థలు వచ్చి విడిపోయి అంగన్‌వాడీ టీచర్‌గా విధులు నిర్వహిస్తూ ఇద్దరి పిల్లలను పెంచుకుంటూ నానా కష్టాలు పడుతోంది. అయితే ఆమె విధులు సరిగా నిర్వహించడం లేదని, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి ఉద్యోగం తీయించి వేస్తానని బెదిరిస్తూ రూ.50 వేలు డిమాండ్ చేస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొంది. అతని నుంచి ప్రాణాలకు ముప్పు ఉందని ప్రాణ రక్షణ కల్పించాలని పోలీసులను అభ్యర్థించింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజకుమార్ తెలిపారు.

బాలుడి అదృశ్యంపై కేసు నమోదు

ఆకివీడు: అద్దె డబ్బులు వసూలు కోసం చింతలపూడి వెళ్లిన ఓ బాలుడు అదృశ్యమయ్యాడు. వివరాలిలా ఉన్నాయి. స్థానిక గంగానమ్మ కోడు ప్రాంతంలో నివసిస్తున్న 16 ఏళ్ల బాలుడు మేకల ఆనంద్ ఈ నెల 24న తెల్లవారుజామున ఇంటి అద్దె వసూలు కోసం చింతలపూడి వెళ్లాడు. ఆనంద్ తిరిగిరాకపోవడంతో సోదరుడు మేకల వెంకటేశ్వరరావు అతని ఆచూకీ కోసం ప్రయత్నించినా దొరకలేదు. ఆనంద్ సెల్‌ఫోన్ రింగ్ అవుతున్నా ఎవరూ ఎత్తడం లేదు. దీంతో వెంకటశ్వరరావు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ సత్యనారాయణ చెప్పారు.

తల్లిదండ్రులకు బాలుడి అప్పగింత



ఏలూరు టౌన్: ఇంటి నుంచి పారిపోయి వచ్చిన ఏలూరు పెద్ద రైల్వేస్టేషన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ బాలుడిని పోలీసులు అతని తల్లిదండ్రులకు అప్పగించారు. ఏలూరు రైల్వే ఎస్సై డి.నరసింహారావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఏలూరు పెద్ద రైల్వేస్టేషన్ ఫ్లాట్‌ఫామ్–2పై బుధవారం ఒక బాలుడు అటుఇటూ తిరుగుతూ కనిపించాడు. బాలుడ్ని వివరాలు అడుగగా, బాలుడు హనుమాన్ జంక్షన్‌లోని స్కూల్ నుంచి పారిపోయి వచ్చాడని తెలుసుకున్నారు. బాలుడు చదివే స్కూల్ వారితో మాట్లాడి తల్లిదండ్రుల వివరాలు తెలుసుకున్నారు. వారిని ఏలూరు పిలిపించి బాలుడిని అప్పగించారు.

రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి



ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా నూజివీడు రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని రైలు నుంచి జారిపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. వెస్ట్ బెంగాల్ దక్షిణ దింజాపూర్ ప్రాంతానికి చెందిన నిర్మల్ పహాస్ అనే వ్యక్తి గుర్తు తెలియని రైలులో ప్రయాణం చేస్తూ నూజివీడు రైల్వేస్టేషన్ సమీపంలో జారిపడి మృతి చెందాడు. మృతదేహాన్ని ఏలూరు జీజీహెచ్ మార్చురీలో భద్రపరిచారు. వివరాలకు ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని రైల్వే ఎస్ఐ నరసింహారావు తెలిపారు.

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందిం చాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

పాలిచ్చే తల్లుల కోసం ప్రత్యేక గదులు

- తొలిగా కలెక్టర్, ఎస్పీ కార్యాలయాల్లో అమలుకు చర్యలు
- సుప్రీంకోర్టు మార్గదర్శకాల అమలుపై సమీక్షలో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు (మెట్రో): సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు తల్లుల గోప్యతను కాపాడేందుకు జనసాంద్రతగల ప్రదేశాల్లో తల్లులు పిల్లలకు పాలు ఇచ్చేందుకు (బ్రెస్ట్ ఫీడింగ్), చైల్డ్ కేర్ గదుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. ఈ విషయంపై సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు స్థానిక కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి కమిటీ సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల భద్రత విషయంలో ఎక్కువగా జనసాంద్రతగల బస్టాండ్, రైల్వే స్టేషన్లు, ప్రభుత్వ ఆసుపత్రులు, ఏరియా హాస్పిటల్స్, సీహెచ్‌సీ, పీహెచ్‌సీ, కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం, తదితర ప్రాంతాల్లో బ్రెస్ట్ ఫీడింగ్ గదులు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఇందులో భాగంగా మొదటగా జిల్లా కలెక్టరేట్, జిల్లా ఎస్పీ కార్యాలయాల్లో ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. ఇందుకు సంబంధించి అన్ని శాఖలు 15 రోజుల్లో కార్యాచరణ ప్రణాళిక సమర్పించాలన్నారు. అదే విధంగా జిల్లా పరిషత్, ఐసీడీఎస్, డీపీవో, డీఆర్‌డీఏ, డ్వామా తదితర కార్యాలయాలతోపాటు మహిళలు ఎక్కువగా పనిచేసే పరిశ్రమల్లో, షాపింగ్ మాల్స్, విద్యా సంస్థలు, పబ్లిక్ పార్కులు వంటి ప్రదేశాల్లో వీటిని ఏర్పాటు చేయాలన్నారు. సమాజంలో ఈ గదుల ఆవశ్యకతపై పోస్టర్ల ద్వారా అవగాహన పెంపొందించాలన్నారు. ఈ ఫీడింగ్ గదులు పాలిచ్చే తల్లులకు గోప్యత, సౌకర్యాన్ని అందిస్తాయన్నారు. ఇటువంటి సౌకర్యం కల్పించడం ద్వారా తల్లి బిడ్డకు పాలివ్వడాన్ని ప్రోత్సహిస్తూ, ఇది తల్లీబిడ్డా ఇద్దరికి అనేక ఆరోగ్య ప్రయోజనాలను కలిగిస్తుందన్నారు. అదే విధంగా మహిళలు వినియోగించే మూత్రశాలల్లో ఇన్సినెరేటర్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఏవీఎన్ఎస్ మూర్తి, ఇన్‌ఛార్జి డీఎంహెచ్‌ఓ డా.నాగేశ్వరరావు, జీఎండీఐసీ ఏసుదాసు, డీసీపీవో సూర్య చక్రవేణి, పోలీసు, పరిశ్రమలు, ఆర్.టి.సి, నగరపాలక సంస్థ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఏలూరులో క్రైస్తవ సంఘాల భారీ ర్యాలీ

మణిపూర్‌లో దమనకాండపై నిరసన



ఏలూరులో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవ సంఘాల ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): మణిపూర్‌లో మతోన్మాద ఉగ్రవాదులు చేస్తున్న దమనకాండను వెంటనే అదుపు చేయాలని, మణిపూర్ రాష్ట్రంలో శాంతిని నెలకొల్పాలని ఏలూరు నగర క్రైస్తవ సమాజం ప్రతినిధులు కోరారు. మణిపూర్‌లో దమనకాండను నిరసిస్తూ సోమవారం ఏలూరులో పలు క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ రోడ్డులోని సీఎస్ఐ కాంపౌండ్ నుంచి పాత బస్ స్టాండ్, కర్రల వంతెన, వసంతమహల్ మీదుగా ఫైర్‌స్టేషన్ సెంటర్ వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీఎం సంఘాల అగ్ర పీఠాధిపతి, ఆంధ్రప్రదేశ్ కౌన్సిల్ ఆఫ్ చర్చస్ అధ్యక్షుడు బిషప్ జాన్ ఎస్‌డీ రాజు మాట్లాడుతూ మణిపూర్‌లో వెంటనే రాష్ట్రపతి పాలన విధించి, శాంతిని నెలకొల్పాలని, మరణించిన వారికి పరిహారం చెల్లించాలని, ధ్వంసం చేయబడిన క్రైస్తవ దేవాలయాలను, వాటి ఆస్తులను ప్రభుత్వ సొమ్ముతో పునర్నిర్మించాలని డిమాండ్ చేశారు. పాస్టర్ జ్యోతిరాజు మాట్లాడుతూ రెండు జాతుల మధ్య వైరంగా ప్రభుత్వాలు అభివర్ణిస్తున్నా, కచ్చితంగా మతోన్మాద ఉగ్రవాదుల దాష్టీకమేనని, ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలని డిమాండ్ చేశారు. ఏలూరు పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జీపీ ఆశీర్వాదం మాట్లాడుతూ కేవలం క్రైస్తవులను, పాస్టర్లను, వారి దేవాలయాలను, వాటి ఆస్తులనే లక్ష్యంగా చేసుకుని జరిగిన విధ్వంసమని, అందుకు ప్రభుత్వాలే బాధ్యత వహించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ జగదీష్ బాబు మాట్లాడుతూ ఏ క్షణంలో ఏ ఆపద ముంచు కొస్తుందోనని బిక్కుబిక్కుమంటూ బతుకుతున్న మణిపూర్ ప్రజలకు ధైర్యాన్ని కల్పించాల్సిన ప్రభుత్వాలు తమకు పట్టనట్లు ప్రవర్తించడం, సరైన రీతిలో స్పందించకపోవడం అన్యాయమన్నారు. అనంతరం కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. తొలుత సీఎస్ఐ సంఘ కాపరి రత్నరాజు ప్రార్థనతో ర్యాలీ ప్రారంభమైంది. ఈ ర్యాలీకి యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ నాయకులు పీవీ రాజు, ప్రముఖ క్రైస్తవ నాయకులు, మన్నా చర్చ్ పాస్టర్ జ్యోతిరాజు, సిటీ పాస్టర్స్ కౌన్సిల్ నాయకుడు ఎబినేజర్ శాస్త్రి తదితరులు నాయకత్వం వహించారు.

విద్యార్థినుల మధ్య గొడవ.. బాలికపై వ్యక్తి దాడి



ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రజని

నూజివీడు: ఇద్దరు బాలికల మధ్య గొడవ జరగగా, ఒక బాలిక తండ్రి మరో బాలికను విచాక్షణారహితంగా కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. గొల్లపల్లికి చెందిన గరికే రజని (11), కూతాటి లక్ష్మీదుర్గ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నారు. రజనికి తల్లిదండ్రులు లేకపోవడంతో నాయనమ్మ దగ్గర ఉంటోంది. వీరిద్దరూ స్నేహితులు కావడమే కాకుండా పక్కపక్కనే కూర్చుంటారు. బుధవారం బడికి రాగానే రజని పెన్నుతో లక్ష్మీదుర్గను పొడవగా, లక్ష్మీదుర్గ రజనిని కొట్టింది. ఆ తరువాత లక్ష్మీదుర్గ ఇంటికి వెళ్లి వాళ్ల అమ్మతో చెప్పగా ఆమె స్కూల్ వద్దకు వచ్చి ఈ విషయాన్ని ఉపాధ్యాయుడి దృష్టికి తీసుకెళ్లి ఇంటికి వెళ్లిపోయింది. ఆ తరువాత 11.30 గంటల సమయంలో రజని ఇంటికి వెళ్లి స్కూల్లో గొడవ విషయాన్ని నాయనమ్మ వెంకటేశ్వరమ్మకు చెప్పి కొద్దిసేపు ఇంటి వద్ద ఉండి తిరిగి బడికి వెళుతుండగా లక్ష్మీదుర్గ తండ్రి కూతాటి సుబ్బారావు అలియాస్ చంటి.. రజనిని పట్టుకుని ఇంట్లోకి తీసుకెళ్లి విచక్షణారహితంగా కొట్టాడు. దీంతో తలకు, ముక్కు, మూతి వద్ద తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానిక పీహెచ్‌సీకి రజనీని తీసుకెళ్లి చికిత్స చేయించి పంపించారు. దెబ్బలతో ఇంటికి వచ్చిన నాయనమ్మ ఎవరు కొట్టారని అడగగా జరిగిన విషయమంతా చెప్పడంతో వెంటనే విషయాన్ని రూరల్ ఎస్సై తలారి రామకృష్ణకు ఫిర్యాదు చేశారు. అనంతరం 108 అంబులెన్స్‌లో మెరుగైన చికిత్స నిమిత్తం నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించారు. బాధితురాలి నాయనమ్మ వెంకటేశ్వరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వర్షం వస్తోందని.. మేడెక్కిన ఆబోతు

పాలకొల్లు కోర్టు ఎదుట వాణిజ్య సముదాయం వద్ద ఘటన



మొదటి అంతస్తులోకి ఎక్కిన ఆబోతు

పాలకొల్లు సెంట్రల్: వర్షం వస్తోందని ఓ ఆబోతు మేడెక్కి స్థానికులను ఉరుకులు పెట్టించింది. వివరాల్లోకి వెళితే.. మంగళవారం రాత్రి 6 గంటల సమయంలో వర్షం కురుస్తుండగా ఓ ఆబోతు పట్టణంలోని కోర్టు ఎదుట ఉన్న వాణిజ్య సముదాయం మొదటి అంతస్తుపైకి మెట్లు మార్గం ద్వారా ఎక్కేసింది. అక్కడ వరండా తక్కువగా ఉండడంతో ఆబోతు వెనక్కి అడుగులు వేసుకుంటూ రావడం మినహా ప్రత్యామ్నాయం లేదు. ఏ మాత్రం కాలుజారినా భవనం పైనుంచి కిందకు పడిపోయే ప్రమాదం ఉంది. దీంతో బుధవారం ఉదయం 11 గంటల సమయంలో యానిమల్ వారియర్స్ టీం సభ్యుడు మనిష్ గౌడ్‌కు స్థానికులు సమాచారం ఇవ్వడంతో తన సిబ్బందితో అక్కడకు చేరుకున్నారు. స్థానికుల సహకారంతో ఆ ఆబోతుకు ముందుగా పక్క భవనంలో నుంచి మేత అందించారు. ఆ తరువాత ఆబోతు వెనకాలే వెళ్లి ఓ ఆఫీసు గది తాళం తెరిచారు. అనంతరం ఆబోతును నెమ్మదిగా నాలుగు అడుగులు వెనక్కి వేయించి ఆ ఆఫీసు గది నుంచి బయటకు రప్పించారు. సుమారు 20 మెట్లు ఉన్న ఈ భవనం నుంచి ఆబోతు ఒక్కో మెట్టు కిందకు సురక్షితంగా దిగడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. రెండున్నర గంటల పాటు శ్రమించి భారీ కాయంతో ఉన్న ఆబోతును సురక్షితంగా కిందకి దించడంతో స్థానికులు యానిమల్ వారియర్స్ సభ్యులను అభినందించారు.

క్లుప్తంగా

ఓటర్ల జాబితా సవరణకు సహకరించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ దుర్గాకిషోర్, చిత్రంలో మండల ప్రత్యేకాధికారి దుర్గేష్

తాడేపల్లిగూడెం రూరల్: ఓటర్ల జాబితా సవరణకు రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని తహసీల్దార్ వై.దుర్గాకిషోర్ అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై వివిధ రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ దుర్గాకిషోర్ మాట్లాడుతూ 2024 జనవరి 1వ తేది నాటికి 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులను ఓటర్లుగా చేర్పించాలన్నారు. అలాగే చేర్పులు, మార్పులు, తొలగింపు, బదిలీ, ఇతరత్ర కార్యక్రమాలు ఓటర్ల జాబితా పరిశీలనకు వచ్చిన సందర్భంలో దరఖాస్తులు అందజేసేలా చూడాలన్నారు. ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ సజావుగా సాగడానికి సహకరించాలని కోరారు. ఆగస్టు 21వ తేది వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లు విధులు బాధ్యతగా నిర్వహించాలి



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ (ఫైల్)

తాడేపల్లిగూడెం అర్బన్ : మున్సిపల్ వార్డుల్లోని ఆయా క్లష్టర్లలో విధులు నిర్వహిస్తున్న వలంటీర్లు, వార్డు సచివాలయాల అడ్మిన్లు, సెక్రటరీలు తమ విధులను బాధ్యతగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ అనపర్తి శామ్యూల్ పలు సూచనలు చేశారు. ఇటీవల జగనన్న సురక్ష సమావేశాల్లో కొందరు వలంటీర్లు, సచివాలయాల సెక్రటరీలు కార్యక్రమాలపై సరైన అవగాహన లేకపోవడంపై ఆయన అసంతృప్తిని వ్యక్తం చేశారు. దీంతో కమిషనర్ కొందరు వలంటీర్లు, సచివాలయ సెక్రటరీలు, అడ్మిన్లతో మాట్లాడారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న సంక్షేమ పథకాలు, జగనన్న సురక్ష కార్యక్రమాలపై సంపూర్ణంగా అవగాహన చేసుకోవాలని సూచనలు చేశారు. వలంటీర్లు తీసుకువచ్చిన సమాచారాన్ని సచివాలయాల్లో సెక్రటరీలు ఆన్‌లైన్ చేయాలని ఆదేశాలిచ్చారు. భవిష్యత్తులో ఈ విషయాలపై ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

బడి బయట పిల్లలను బడిలో చేర్పిద్దాం



తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈఓ పీఎంకే జ్యోతి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణ పరిధిలో బడి బయట ఉన్న పిల్లలను బడిలో చేర్పిద్దామని మండల విద్యాశాఖాధికారిణి (ఎంఈఓ) పీఎం కే జ్యోతి అన్నారు. స్థానిక 24, 25 వార్డుల్లో ఎంఈఓ ఆధ్వర్యంలో డ్రాప్‌ఔట్స్, జీఈఆర్ సర్వేలు నిర్వహించారు. బడి బయట ఉన్న పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడారు. పిల్లలకు చదువు ఎంతో అవసరమని, తల్లిదండ్రులు గుర్తించాలన్నారు. పిల్లల ఉన్నతికి కృషి చేద్దామన్నారు. ఈ సందర్భంగా విద్యా సంక్షేమ సెక్రటరీ, సీఆర్‌పీలు సహాయంతో బడికి రాని పిల్లలను బడిలో చేర్చేందుకు కృషి చేశారు. వయస్సు రీత్యా పెద్ద పిల్లలను ఓపెన్ స్కూల్‌లో చేర్పించేందుకు నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ జాబీద్, నానిబాబు, నగేష్, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

వాన.. హైరానా..

- ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షం
- పెరుగుతున్న గోస్తనీ, వయ్యేరు నీటి మట్టాలు
- నియోజకవర్గంలో 37 మిల్లీమీటర్ల వర్షపాతం



ఎడతెరపి లేని వర్షాలకు తడిసిన తణుకు పట్టణం

తణుకు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో తణుకు నియోజకవర్గంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో తణుకు పట్టణం తడిచి ముద్దయ్యింది. రెండు రోజులుగా తణుకు నియోజకవర్గంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం కారణంగా లోతట్టు ప్రాంతాలు, పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు నియోజకవర్గంలో 37 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా తణుకు మండలంలో 34.8, ఇరగవరం మండలంలో 41.2, అత్తిలి మండలంలో 35.2 మిల్లీమీటర్లు చొప్పున వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. మరోవైపు రాబోయే రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశారు.

వరి చేలు నీటమునక...

గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు కారణంగా పల్లపు ప్రాంతాల్లో పంట చేలు నీట మునుగుతున్నాయి. ఆలస్యంగా వేసిన నారుమడులకు తీవ్ర నష్టం వాటిల్లే అవకాశాలు కనిపిస్తున్నాయి. తణుకు నియోజకవర్గంలో ప్రతి ఏటా 45 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తుంటారు. ప్రస్తుతం సార్వాలో దాదాపు 70 శాతం మేర నాట్లు పూర్తిగా మిగిలిన ప్రాంతాల్లో నాట్లు ప్రక్రియ కొనసాగుతోంది. మరోవైపు కురుస్తున్న వర్షాలకు లేత ఆకుమడులు చాలా ప్రాంతాల్లో నీట మునిగాయి. రెండ్రోజుల క్రితం నాట్లు వేసిన దాదాపు 10 వేల ఎకరాల్లో మూనల కొనల వరకు నీరు చేరింది. ఇప్పటికిప్పుడు వర్షాలు తగ్గితే స్వల్ప నష్టం నుంచి బయట పడవచ్చని అయితే రెండ్రోజులు వర్షాలు కొనసాగితే మళ్లీ నాట్లు వేయాల్సి వస్తుందని రైతులు దిగాలు చెందుతున్నారు. ఇదిలా ఉంటే ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు గోస్తనీ నదితోపాటు దువ్వ వెంకయ్య వయ్యేరు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్నాయి. గట్లు ఆనుకుని నీటి ప్రవాహం ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

వలంటీర్లకు వందనం

రెడ్ జోన్‌లో ధైర్యంగా సేవలు



కరోనా సోకిన వారిని వాహనంలో తీసుకువెళ్తున్న వలంటీర్ సీహెచ్ దుర్గా వర ప్రసాద్ (ఫైల్)

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆది కరోనా మహమ్మారి మొదటి వేవ్. లాక్ డౌన్‌తో పట్ట పగలే జన నివాసాల మధ్య నిశ్శబ్ద వాతావరణం. ఎవరూ ఇంటి గుమ్మం దాటి బయటకు రాలేని పరిస్థితి. ఆ సమయంలో తాడేపల్లిగూడెం పట్టణంలో ఏడో వార్డులో రెడ్ జోన్, పాజిటివ్ కేసులు గుర్తించడం, క్వారంటైన్ సెంటర్‌కు తరలించడం, వారితో కాంటాక్ట్ ఉన్న అనుమానితులకు పరీక్షలు చేయించడంలో 7వ వార్డు వలంటీర్ సీహెచ్ దుర్గా వర ప్రసాద్ ధైర్యంగా ముందుకు సాగాడు. రక్షణ చర్యలు తీసుకుంటూ ప్రజలకు సేవలు అందించాడు. ఫీవర్ సర్వేలో పాల్గొని కరోనా లక్షణాలు ఉన్న వారికి పరీక్షలు చేయించాడు. హోం ఐసోలేషన్‌లో ఉన్న వారికి మందులు అందించి, అవసరమైన కూరగాయలు అందించేవారు. అప్పటి కరోనా బాధితులు ఇప్పటికీ సీమెచ్ దుర్గాప్రసాద్ సేవలు గుర్తించికుంటూ అభినందిస్తున్నారు.

కుటుంబ సభ్యుడిలా



నా పేరు చింతల సూర్యకాంతం. నేను తాడేపల్లిగూడెం 7వ వార్డులో నివాసం ఉంటున్నాను. మా వార్డు వలంటీర్ దుర్గా వరప్రసాద్ మాకు అనేక సేవలు అందిస్తున్నాడు. కరోనా కష్టకాలంలో ఎన్నో సేవలు అందించాడు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అమలు అవుతున్న అన్ని సంక్షేమాలను ప్రజలకు చేరవేయడంలో వార్డు వలంటీర్ కృషి అభినందనీయం. యాక్సిడెంట్ జరిగి విజయవాడలో చికిత్స పొందుతున్న సమయంలో వలంటీర్ ప్రసాద్ అక్కడకు వచ్చి నాకు పెన్షన్ అందజేశాడు. వలంటీర్లు అందిస్తున్న సేవలు కొనియాడదగినవి.

– చింతల సూర్యకాంతం, గృహిణి, 7వ వార్డు

వలంటీర్లకు సలాం



తాడేపల్లిగూడెం (టీఓసీ): నా పేరు అద్దాల శ్రీనివాసరావు. నేను గూడెం పట్టణంలో 7వ వార్డులో నివసిస్తున్నాను. మా వార్డు క్లస్టర్ వలంటీర్ దుర్గా వర ప్రసాద్ తమకు అనేక సేవలు అందిస్తున్నాడు. వలంటీర్ ఇంటింటికి తిరుగుతూ ఎప్పటికప్పుడు ప్రభుత్వ సంక్షేమాలను తెలియజేయడం వల్ల రైస్ కార్డు, పెన్షన్, అమ్మఒడి, వైఎస్సార్ చేదోడు వంటి పథకాలు పొందాం. కరోనా సమయంలో వలంటీర్ ఎంతో సహాయం అందజేశారు.

– అద్దాల శ్రీనివాసరావు, రజక వృత్తిదారుడు, 7వ వార్డు

రెసిడెన్షియల్ ప్రాంతాల్లో దుకాణ భవనాలు నిర్మిస్తే చర్యలు



వివరాలు వెల్లడిస్తున్న కమిషనర్ డాక్టర్ శామ్యూల్

తాడేపల్లిగూడెం అర్బన్ : మున్సిపల్ పరిధిలో నివాస (రెసిడెన్షియల్) గృహాల నిర్మాణ ప్రాంతాల్లో దుకాణ సముదాయాలు నిర్మిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ అనపర్తి శామ్యూల్ వెల్లడించారు. బుధవారం ఆయన ఈ విషయంపై మాట్లాడుతూ పలు అంశాలను తెలిపారు. తాడేపల్లిగూడెం పట్టణం అభివృద్ధిలో మొదటి స్థానంలో ఉందన్నారు. దీనికి అనుగుణంగా పట్టణ పరిసర ప్రాంతల్లో లేఅవుట్లు ఏర్పాటు చేస్తున్నారన్నారు. లేఅవుట్లు, అపార్టుమెంట్లు, సొంత గృహ నిర్మాణం, అనధికార లేఅవుట్లు విపరీతంగా పెరుగుతున్నాయన్నారు. రెసిడెన్షియల్ ఏరియా, కమర్షియల్ ఏరియా తదితర ప్రాంతాలను మాస్టర్ ప్లాన్‌ను ఏర్పాటు చేశామన్నారు. రెసిడెన్షియల్ ఏరియాల్లో గృహాలు మాత్రమే నిర్మించాలన్నారు. వ్యాపార భవనాలు నిర్మిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనాలపై వివరాలను సేకరిస్తున్నామన్నారు. సొంత గృహాలు నిర్మించుకొనే యజమానులు తప్పనిసరిగా మున్సిపల్ కార్యాలయంలోని పట్టణ ప్రణాళికా విభాగం నుంచి ప్లాన్‌ను తీసుకోవాలన్నారు. అనుమతులు లేకుండా నిర్మించిన భవనాలను తొలగించేందుకు చర్యలు చేపడతామన్నారు. అదేవిధంగా అధికార లేఅవుట్లుతో పాటు నాన్ లేఅవుట్లలో గృహాలు నిర్మించుకొనేవారు పట్టణ ప్రణాళికా విభాగం ఇచ్చిన ప్లాన్ ప్రకారమే నిర్మించుకోవాలని సూచించారు. లేని పక్షంలో చట్టపరంగా చార్జిషీటు దాఖలు చేయడానికి వెనుకాడబోమని హెచ్చరించారు. ఈ విషయాలపై కార్యాలయంలోని పట్టణప్రణాళికా విభాగం, సచివాలయాల ప్రణాళికా సెక్రటరీలకు పలు సూచనలు చేశామన్నారు.

సర్వేయర్ల ప్లాన్‌లు పరిశీలిస్తాం :

పట్టణానికి సంబంధించిన ప్రైవేటు సర్వేయర్లు తయారు చేసిన ప్లాన్‌లను పరిశీలిస్తామని మున్సిపల్ కమిషనర్ శామ్యూల్ తెలిపారు. ఫీల్డ్ విజిట్ చేయకుండా వారు ప్లానులు సిద్ధం చేస్తున్నట్లు తమ పరిశీలనలో వెల్లడయిందన్నారు. భవన నిర్మాణం చేసుకొనే వారి స్థలాలను స్వయంగా పరిశీలించి ప్లాన్‌లు సిద్ధం చేయాలని సర్వేయర్లుకు సూచించారు. సర్వేయర్లు ఇచ్చిన ప్లాన్‌కు నిర్మాణం జరిగిన భవనం ప్లాన్‌కు తేడాలుంటే ఇరుపక్షాలపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలకు ఇబ్బందులు తావులేకుండా సర్వేయర్లు బాధ్యత వహించాలన్నారు.

భారీ వర్షం.. మునిగిన వరి నాట్లు



యానాలపల్లి గ్రామంలో మునిగిన వరి నాట్లు

పెంటపాడు: గత రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాల వల్ల పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. పంచాయతీ డ్రైన్‌లు పొంగి ప్రవహిస్తున్నాయి. ఇటీవలే నాట్లు వేసిన కొన్ని గ్రామాల్లోని పొలాలు నీట మునిగాయి. ప్రధానంగా విప్పర్రు, బి. కొండేపాడు గ్రామాల్లో రహదారి గోతుల్లో వర్షం నీరు చేరి వాహనదారులకు ఆటంకంగా మారింది. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది.

మణిపూర్ ఘటనపై వెల్లువెత్తిన నిరసన



అత్తిలిలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రజా సంఘాల ప్రతినిధులు



గూడెంలో తహసీల్దార్‌కు మణిపూర్ సంఘటనలపై వినతిపత్రం అందజేస్తున్న డిస్ట్రిక్ట్ పాస్టర్ల సంఘం ప్రతినిధులు

అత్తిలి: మణిపూర్‌లో జాతుల మధ్య మత మారణ హోమానికి తెరదీసిన బీజేపీ, ఆర్ఎస్ఎస్ అమానుష చర్యలను నిరసిస్తూ అత్తిలి సెంటర్‌లో బుధవారం ఆల్ ఇండియా దళిత రైట్స్ ఫోరమ్, కేవీపీఎస్, ఏయూపీఎఫ్ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన జరిపారు. ఈసందర్భంగా ఆల్ ఇండియా దళిత రైట్స్‌ఫోరం మండల అధ్యక్షుడు బట్టు నాగరాజు మాట్లాడుతూ మణిపూర్‌లో జరిగిన ఘటన సభ్య సమాజాన్ని కలిసి వేసేలా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీం కోర్టు స్పందించే వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకపోవడానికి కారణాలు ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా మణిపూర్ దోషుల్ని అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు చిన్నం చిన నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్రంలో 2014 నుంచి బీజేపీ అధికారంలోకి వచ్చిన దగ్గరనుంచి నేటి వరకు దేశంలో ఎక్కడో ఒకచోట ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలపై దాడులు జరుగుతూనే ఉన్నాయని అన్నారు. మణిపూర్‌లో మతోన్మాదాన్ని రెచ్చగొట్టి మరోసారి గద్దె నెక్కాలని ప్రయత్నాలు చేస్తుందని పేర్కొన్నారు. యునైటెడ్ పాస్టర్ ఫెలోషిప్ అధికారి పి సంపదరావు మాట్లాడుతూ దేశంలో యువతకి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు చూపకుండా మతోన్మాద దాడులు, అల్లర్లను ప్రోత్సహించడం బీజేపీ ప్రభుత్వం చేతకానితనం తేటతెల్లమైందని అన్నారు. ఈసందర్భంగా అత్తిలిలో అంబేద్కర్ విగ్రహం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన చేసి, తహసీల్దార్ ఏపీ రామాంజనేయులకు వినతిపత్రం అందజేసారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎస్‌డబ్ల్యూఏ జిల్లా అధ్యక్షుడు వెంకటరమణ, పొట్ల గమనియులు, బాతు నరేష్‌కుమార్, మేడిపల్లి సాయికృష్ణ, వై బాబూరావు, కె శేఖర్, యాళ్లస్వామి, అప్రోచ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలి

పెంటపాడు: మణిపూర్ రాష్ట్రంలో మతోన్మాదులు చేస్తున్న మారణకాండను ఆపి, ఆ చర్యలు పునరావృతం కాకుండా చూడాలని డిస్ట్రిక్ట్ పాస్టర్ల అసోషియేషన్ కమిటీ డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా ఆ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కొమ్మిశెట్టి జాజిరాజు, డి. డేవిడ్‌లు మాట్లాడుతూ ఆ రాష్ట్రంలో సుమారు 600కి పైగా చర్చిలు కూల్చివేసి అక్కడి పాస్టర్లను మతోన్మాదులు హింసిస్తున్నారన్నారు. స్త్రీలను నగ్నంగా ఊరేగించే ఆటవీక సంస్కృతికి చరమగీతం పాడాలని, దుష్టశక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని ఈ సందర్భంగా కోరారు. సంఘ వైస్ ప్రెసిడెంట్ మోజస్, మిఖాయేలు, కో ఆర్డినేటర్ జాన్సన్, ఐ. శ్యాంబాబు డీపీఏ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

యువత దేశభక్తిని పెంచుకోవాలి



అలంపురం గ్రామంలో వీరజవాన్ స్థూపం వద్ద విద్యార్థులు నివాళులు

పెంటపాడు: యువత దేశభక్తిని పెంపొందించుకొని ప్రతీ ఒక్కరూ దేశం కోసం సైనికుల్లా ఎదగాలని రాష్ట్ర మాజీ సైనిక ఉద్యోగుల సంఘ నాయకులు తనబుద్ధి భోగేశ్వరరావు పేర్కొన్నారు. కార్గిల్ విజయ్‌దివస్ పురస్కరించుకొని అలంపురంలోని వీరజవాన్ స్థూపం వద్ద ఆయన నివాళ్లులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు దేశభక్తి పూరిత గాధలు వినిపించారు. సైనికుల సేవలు చిరస్మరణీయమన్నారు. కార్గిల్ యుద్ధంలో అశువులు బాసిన వారికోసం ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఈ కార్యక్రమంలో టీబీఆర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గూడెంలో 37.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణ, పరిసర గ్రామాల్లో గడిచిన 24 గంటల్లో 37.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని తహసీల్దార్ వై.దుర్గాకిషోర్ బుధవారం తెలిపారు. పెంటపాడులో 18.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందన్నారు.

రేపు పెదఅమిరంలో భారీ ప్లాంటేషన్ కార్యక్రమం

కాళ్ల: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా శుక్రవారం భారీ ప్లాంటేషన్ కార్యక్రమం జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ప్రారంభిస్తారని ఎంపీడీవో జి.స్వాతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు తొలుత కలెక్టర్ బంగ్లా ప్రాంతంలో ఈ కార్యక్రమం వివరించారు. అనంతరం జక్కరం, కోపల్లె గ్రామాల్లో కూడా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. స్వయం సహాయక గ్రూపుల సభ్యులు పంచాయతీ పాలకవర్గం సభ్యులు, గ్రామ పెద్దలు, స్వచ్ఛంద సంస్థలు, ఉపాధి హామీ వేతనదారులు, పాఠశాల విద్యార్థులను భాగస్వాములుగా చేసి మొక్కలు నాటిస్తామని ఆమె స్పష్టం చేశారు.

డ్రెయినేజీలపై ఆక్రమణల తొలగింపు



పట్టణంలో ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం అర్బన్ : పట్టణంలోని ప్రధాన రహదారుల వెంబడి ఉన్న డ్రెయినేజీలను ఆక్రమించి కాంక్రీటు సపటాలు నిర్మించడంతో ఒక మోస్తరు వర్షం నుంచి భారీ వర్షాలు కురిసిన సమయంలో వర్షపునీరు రోడ్లపైనే నిలిచిపోతుంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు కేఎన్‌రోడ్డులోని కొన్ని ప్రాంతాల్లో వర్షపునీరు నిలిచిపోవడంతో ఆ రహదారి వెంట రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచారులు ఈ సమస్యను మున్సిపల్ కమిషనర్ శామ్యూల్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో కమిషనర్ అనపర్తి శామ్యూల్, ఎంఈ మురళీకృష్ణలు బుధవారం రాత్రి డ్రెయినేజీలపై ఆక్రమణల తొలగింపు కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్థానిక గొల్లగూడెం సెంటరు నుంచి ఆర్‌టీసీ గ్యారేజ్ ప్రాంతం వరకు ఆక్రమణలకు గురైన డ్రెయినేజీలను తొలగించారు. దీంతో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు తొలగిపోయింది.

30 లక్షలతో డ్రెయినేజీ నిర్మాణం:

వర్షపునీరు రోడ్డుపై నిలిచిన కారణంగా తొలగించిన ఆక్రమిత డ్రెయినేజీ స్థానంలో నూతన డ్రెయినేజీలను నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు మున్సిపల్ ఇంజినీరు డి మురళీకృష్ణ బుధవారం తెలిపారు. నూతనంగా డ్రెయినేజీలు నిర్మించేందుకు రూ.30లక్షలు మంజూరైనట్లు తెలిపారు. నిరంతరం వర్షాలు తగ్గిన అనంతరం డ్రెయినేజీ నిర్మాణం ప్రారంభిస్తామని మురళీకృష్ణ తెలిపారు.

మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యత



కృష్ణాపురం గ్రామంలో దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ రాష్ట్ర కోశాధికారి కొల్లా విజయలక్ష్మి కుమారిని సన్మానిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మహిళల భద్రతకు దిశా ప్రొటెక్షన్ సెల్ ఎంతగానో ఉపకరిస్తుందని జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు అన్నారు. బుధవారం మండలంలోని కృష్ణాపురం గ్రామంలో దిశా ప్రొటెక్షన్ వెల్ఫేర్ నూతన కమిటిని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ ఆంజనేయులు మాట్లాడుతూ మహిళల సంరక్షణకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దిశా ప్రొటెక్షన్ సెల్‌ను తీసుకొచ్చారన్నారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా మహిళల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత నిస్తున్నారన్నారు. నూతన కమిటి అధ్యక్షురాలిగా జంపెల్లి అనూరాధ, కార్యదర్శిగా తోట విజయలక్ష్మి, ఇతర సభ్యులుగా పెదముత్తి రోషి, పెదముత్తి సువర్ణకుమారి, పెదముత్తి ధనలక్ష్మి, పెదముత్తి గాయత్రి, మాండ్రు ప్రవల్లిక, కందుల నాగలక్ష్మి, జామిశెట్టి వెంకటలక్ష్మి, మల్లిపూడి సుజాతలను నియమించారు. అనంతరం దిశా ప్రొటెక్షన్ వెల్ఫేర్ రాష్ట్ర కోశాధికారి కొల్లా విజయలక్ష్మికుమారిని సన్మానించారు. గ్రామస్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రక్షణకు, రాబడికి ధనవృద్ధి పాలసీ

ఆకివీడు: జీవిత బీమా పాలసీల్లో కొత్తగా వచ్చిన ధన వృద్ధి పాలసీ బీమాదారులకు రక్షణగానూ, రాబడినిస్తుందని స్థానిక ఎల్ఐసీ శాటిలైట్ కార్యాలయ బ్రాంచి మేనేజర్ పి.మురళీ చెప్పారు. ధన వృద్ధి పాలసీ ప్రచార రథాన్ని కార్యాలయం వద్ద బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవిత బీమా పాలసీలు చేయించుకోవడం ద్వారా ఎన్నో జీవితాలు ఆర్థికంగా స్థిరపడుతున్నాయని చెప్పారు. డీఓ జీ.వీర కుమార్, కె.పోతరాజు, ఎస్.దుర్గారావు పాల్గొన్నారు.

విద్యకు అధిక ప్రాధాన్యత

కాళ్ల: ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అనేక సౌకర్యాలు కల్పిస్తుందని ఎంఈఓ ఎ.రవీంద్ర అన్నారు. కోపల్లె హైస్కూల్లో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ ఉపాధ్యాయులు వృత్తిపరమైన నైపుణ్యాన్ని సాధించి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు గుణాత్మకమైన విద్యను అందించాలని సూచించారు. విద్యార్థులు రీడింగ్ , రైటింగ్లో నైపుణ్యం పెంపొందించేందుకు ఉపాధ్యాయులు తీసుకోవాల్సిన జాగ్రత్తల పై సూచనలు ఇచ్చారు. సమావేశంలో ఎంఈఓ-2 జి.కనకరాజు, కోపల్లె హైస్కూల్ హెచ్ఎం కె.సుబ్బరాజు, కోపల్లె, బొండాడ, సీసలి పరిధిలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

29 నుంచి సంగీతోత్సవాలు

పెనుగొండ: స్థానిక త్యాగరాజ కళాభవనంలో 38వ సంగీతోత్సవాలు ఈ నెల 29 నుంచి 31 వరకూ నిర్వహించనున్నట్లు త్యాగరాజ గాన సభ అధ్యక్షురాలు డాక్టర్ కలిదిండి అన్నపూర్ణ తెలిపారు, బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 29న యువగాయని కొమ్మా జోశ్యుల అలేఖ్య గాత్ర సంగీత విభావరి, 30న సంగీత విద్వన్మణి వేలూరి తులసీ విశ్వనాథ్ గాత్ర సంగీత విభావరి, 31న నృత్య విభావరి, సంగీత విభావరిని నిర్వహించనున్నట్లు తెలిపారు. సంగీత ప్రియులు, గ్రామస్తులు సంగీతోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సంగీత అధ్యాపకురాలు గుత్తిన అన్నపూర్ణ పాల్గొన్నారు.

ఓటు నమోదు తప్పనిసరి

సాక్షి, భీమవరం: యువతపైనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని, యువత తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకుని సరైన నాయకత్వాన్ని ఎన్నుకోవాలని భీమవరం డీఎన్నార్ కళాశాల ఉపాధ్యక్షుడు గోకరాజు పాండు రంగరాజు అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక, రెవెన్యూ శాఖ అధ్వర్యంలో నిర్వహిస్తోన్న ఓటు నమోదు, ఓటు హక్కు వినియోగం ప్రచార భేరి కార్యక్రమాన్ని డీఎన్నార్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాండు రంగరాజు మాట్లాడుతూ విద్యావంతులే ఓటు హక్కు వినియోగంలో నిర్లక్ష్యం వహించడం బాధాకరమన్నారు. ప్రిన్సిపాల్ ఎం అంజన్ కుమార్ మాట్లాడుతూ రాజ్యాంగపరంగా సంక్రమించే ఓటును ముందుగా నమోదు చేసుకోవడం ప్రతి పౌరుడి నైతిక బాధ్యతన్నారు. చెరుకువాడ రంగసాయి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వర్మ, లైబ్రేరియన్ కె.శిరీష, ఎన్ఎస్ఎస్ ప్రొగ్రామ్ ఆఫీసర్ వి.ప్రవీణ్, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.